నమస్తే తెలంగాణ
నిజామాబాద్, గురువారం 31 అక్టోబర్ 2024
THURSDAY, OCTOBER 31, 2024

## డివైడర్ కూల్చిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కామారెడ్డి, క్టోబర్ 30 : పట్టణంలోని జీవీఎస్ కళాశాల ఎదుట ఉన్న రోడ్డు డివైడర్‌ను కూల్చిన మాజీ కౌన్సిలర్ సంకోజీ రామ్మోహన్‌పై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణంలోని జీవీఎస్ కళాశాల ఎదుట రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌ను కూల్చి వేసి మధ్యలో ఉన్న సెంటర్ లైట్‌ను తొలగించి ఎలక్ట్రికల్ పోల్‌ను తీసుకెళ్లాడని అన్నారు. అతనిపై చర్యలు తీసుకోవాలని, తిరిగి యథావిధిగా డివైడర్‌ను నిర్మింపజేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మీర్జా హఫీజ్ బేగ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి, నాయకులు గరిగంటి లక్ష్మీనారాయణ, నజీరుద్దీన్, మాసుల లక్ష్మీనారాయణ, గైని శ్రీనివాస్‌గౌడ్, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సఖీ కేంద్రంలో సేవా సదస్సు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ నాగరాణి

కామారెడ్డి, అక్టోబర్ 30 : జిల్లా కేంద్రంలోని సఖీ కేంద్రంలో బుధవారం సేవా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ నాగరాణి హాజరై మాట్లాడారు. మహిళల అభ్యున్నతి, శిశు సంక్షేమ శాఖ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమష్టిగా మహిళల, బాలికలపై జరిగే హింస నుంచి రక్షణ కల్పించేందుకు సఖీ కేంద్రంలో ఐదు రకాల సేవలు ఉచితంగా అందజేస్తారని తెలిపారు. చట్టపరంగా మహిళలకు రకరకాల చట్టాలు రక్షణ కోసం ఉన్నాయన్నారు. మహిళలకు తప్పకుండా న్యాయం జరిగేలా చట్టం సహకరిస్తుందని చెప్పారు. అనంతరం సఖీ కేంద్రం ద్వారా నిర్వహించే ఉచిత అవగాహన కార్యక్రమాల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సెంటర్ అడ్మినిస్ట్రేటర్ భారతి, లీగల్ కౌన్సిలర్ ముదం నవీన్, సఖీ సపోర్టు ఏజెన్సీ పద్మపాని సొసైటీ ఫర్ రూరల్ ఎక్సలెన్స్ కోఆర్డినేటర్ అరుణిమ, సఖీ సిబ్బంది పాల్గొన్నారు.

# మిల్లర్లు ధాన్యానికి బ్యాంకు పూచీకత్తు ఇవ్వాలి

### కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, అక్టోబర్ 30 : మిల్లర్లు ధాన్యానికి బ్యాంక్ పూచీకత్తు ఇవ్వాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2024-25 సంవత్సరం వరి ధాన్యం తీసుకునే ప్రతి మిల్లర్ వ్యక్తిగత బ్యాంక్ పూచీకత్తు తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. అలాగే ధాన్యాన్ని తొందరగా మిల్లులో దించుకోవాలని సూచించారు. మిల్లర్లు, అధికారులు సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా మేనేజర్ రాజేందర్, డీసీఎస్‌వో నరసింహారావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

## కేజీబీవీ తాత్కాలిక మెరిట్ జాబితా విడుదల

కామారెడ్డి, అక్టోబర్ 30 : జిల్లాలోని సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేజీబీవీల్లో తాత్కాలిక పద్ధతిపై అకౌంటెంట్ పోస్టుల భర్తీకి సంబంధించిన మెరిట్ జాబితాను విద్యాశాఖ కార్యాలయంలో, వెబ్‌సైట్ www.deokamareddy.inలో పొందుపర్చినట్లు డీఈవో రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉన్నవారు నవంబర్ 1వ తేదీన జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

## ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి

కామారెడ్డి, అక్టోబర్ 30 : ప్రజలు పటాకులు కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అగ్నిమాపక అధికారి సుధాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లైసెన్స్‌దారుల వద్ద నుంచి నాణ్యత ఉన్న పటాకులను మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. ప్రజల మధ్యలో కాకుండా ఖాళీ స్థలంలో మాత్రమే పటాకులు కాల్చాలన్నారు. బకెట్లో నీటిని దగ్గర ఉంచుకోవాలని, తప్పనిసరిగా కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు. ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే దవాఖానకు తీసుకెళ్లాలని చెప్పారు. సమావేశంలో అగ్నిమాపక సిబ్బంది మహ్మద్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

## ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలి

మాచారెడ్డి, అక్టోబర్ 30 : కామారెడ్డిలో నవంబర్ 3న నిర్వహించనున్న ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు రమేశ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 3న నిర్వహించే సమావేశానికి మండలంలోని ఆయా గ్రామాల నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు భారీ సంఖ్యలో తరలి రావాలని, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరవుతారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలి

బాన్సువాడ, అక్టోబర్ 30 : ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని మాల మహానాడు నాయకులు అన్నారు. బాన్సువాడలోని ప్రభుత్వ అతిథి గృహంలో బుధవారం సమావేశం నిర్వహించారు. మాల మహానాడు నాయకులు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు ఎస్సీ వర్గీకరణ చేయాలంటూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే రద్దు చేయాలన్నారు. మాలల ఉప కులాలకు అన్యాయం చేసిందంటూ మాలమహానాడు నాయకులు ఆరోపిస్తూ బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు ప్రవీణ్ కుమార్, బాన్సువాడ పట్టణ అధ్యక్షుడు సాయిలు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహులు, బాన్సువాడ మండలంలోని వివిధ గ్రామాల అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బాన్సువాడ సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాల మహానాడు నాయకులు

## విద్యుత్ షాక్‌తో యువకుడికి గాయాలు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 30 : మండలంలోని సాతెల్లి గ్రామానికి చెందిన పుట్ట హరీశ్ అనే యువకుడికి విద్యుత్ షాక్ తగిలి తీవ్రగాయాలైనట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. హరీశ్ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం లోడ్‌తో వచ్చిన ట్రాక్టర్‌లోని ధాన్యం కిందికి పోస్తుండగా ట్రాలీకి హైటెన్షన్ విద్యుత్ తీగలు తగలడంతో విద్యుత్ షాక్ తగిలినట్లు వారు తెలిపారు. హరీశ్‌ను కామారెడ్డి దవాఖానకు తరలించామన్నారు.

## ఆశాజనకంగా కంది సాగు

బాన్సువాడ రూరల్, అక్టోబర్ 30 : బాన్సువాడ మండలంలోని గట్టుమీది గ్రామాలైన కాద్లాపూర్, అవాజ్‌పల్లి, కోనాపూర్, సంగోజీపేట్ గ్రామాల్లో సోయా అంతర్ పంటగా సాగు చేస్తున్న కంది పంట ఆశాజనకంగా ఉంది. ఇప్పటికే సోయా పంటను నూర్పిళ్లు చేశారు. అంతర్ పంటగా సాగు చేస్తున్న కంది సకాలంలో కురిసిన వర్షాలకు పంట ఏపుగా పెరిగి పూతదశలో ఉంది. కంది పంట బాగుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సోయాతోపాటు అంతర్ పంటగా వేస్తున్న కంది పంటతో మంచి లాభాలు వస్తున్నాయని రైతులు పేర్కొన్నారు.



కాద్లాపూర్ శివారులో సాగువుతున్న కంది పంట

## బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



మాజీ ఎంపీటీసీ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

భిక్కనూర్, అక్టోబర్ 30 : భిక్కనూర్ మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామ మాజీ ఎంపీటీసీ కోడూరి సాయాగౌడ్‌ను మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ బుధవారం పరామర్శించారు. రెండు రోజుల క్రితం ఎంపీటీసీ సోదరుడు బాబాగౌడ్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంట సొసైటీ చైర్మన్లు భూమిరెడ్డి, వెంకట్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బుర్రి గోపాల్ తదితరులు ఉన్నారు.

## పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

రాజంపేట్, అక్టోబర్ 30 : రాజంపేట మండలం కొండాపూర్‌లో బుధవారం పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి అనిల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడి రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పకుండా వేయించాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యసిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

బాన్సువాడ రూరల్, అక్టోబర్ 30 : మండలంలోని కొల్లూరు - దామరంచ ప్రధాన రహదారిపై బుధవారం జరిగి రోడ్డు ప్రమాదంలో బాన్సువాడ మండలం బోర్లం గ్రామానికి చెందిన జోగోళ్ల ప్రవీణ్(26) అక్కడికక్కడే మృతి చెందాడు. బాన్సువాడ నుంచి హస్గుల్‌కు మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ఆయన వేగంగా వెళ్లి కొల్లూరు గ్రామ శివారులో ఐచర్ వాహనాన్ని బైక్‌తో ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య దైవశీల, ఏడాదిలోపు పాప ఉన్నట్లు కుటుంబీకులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## బాలికపై లైంగికదాడికి యత్నం

బాన్సువాడ, అక్టోబర్ 30 : బాన్సువాడ డివిజన్‌లో ఏడేండ్ల బాలికపై ఓ వ్యక్తి లైంగికదాడికి యత్నించిన ఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. 56 ఏండ్ల వ్యక్తి బాలికకు మాయమాటలు చెప్పి పాడుబడ్డ ఇంటికి తీసుకెళ్లినట్లు తెలిసింది. అటుగా వెళ్తున్న ఓ యువకుడు గమనించి సదరు వ్యక్తిని నిలదీయడంతో అక్కడి నుంచి పారిపోయినట్లు సమాచారం. ఆ బాలిక ఎవరనే విషయం తెలియాల్సింది ఉంది. బాన్సువాడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మాజీ మంత్రికి జాజాల పరామర్శ



మాజీమంత్రి, కరీంనగర్ శాసన సభ్యుడు గంగుల కమలాకర్ ఇంట్లో నివాళి అర్పిస్తున్న ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 30: కరీంనగర్ శాసనసభ్యుడు, మాజీ మంత్రి గంగుల కమలాకర్‌ను బుధవారం ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పరామర్శించారు. గంగుల కమలాకర్ మాతృమూర్తి గంగుల నరసమ్మ తొమ్మిదో రోజు కార్యక్రమంలో ఆయన పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

**పోచారం గ్రామంలో..**

నాగిరెడ్డిపేట, అక్టోబర్ 30 : మండలంలోని పోచారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త కలాలి సాయాగౌడ్ మాతృమూర్తి రామమ్మ(70) బుధవారం అనారోగ్యంతో మృతి చెందగా.. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే సురేందర్ పరామర్శించారు.

**ఎల్లారెడ్డిలో..**

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 30: ఎల్లారెడ్డి పట్టణంతో పాటు పలు గ్రామాల్లో మృతుల కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ బుధవారం పరామర్శించారు. ప్రముఖ న్యాయవాది ఇమ్మాన్యుల్ మృతిచెందడంతో ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శివ్వానగర్ గ్రామానికి చెందిన మోహన్‌గౌడ్ మృతిచెందడంతో ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి నివాళులు అర్పించారు. అడ్విలింగాల్ గ్రామానికి చెందిన పోలీస్ శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకోగా.. వారి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. ఆయనవెంట పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆదిమూలం సతీశ్‌కుమార్, ఎల్లారెడ్డి సొసైటీ అధ్యక్షుడు ఏగుల నర్సింహులు, కౌన్సిలర్ ఎరుకల సాయిలు, నాయకులు ఉన్నారు.

## పిట్లం మార్కెట్ కమిటీ పాలకవర్గానికి ఉత్తర్వులు



పాలకవర్గ సభ్యులకు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

పెద్ద కొడప్‌గల్, అక్టోబర్ 30 : పిట్లం మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. బుధవారం పిట్లం మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ సభ్యులకు ప్రభుత్వం జారీచేసిన పత్రాన్ని ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చీకోటి మనోజ్ కుమార్, వైస్ చైర్మన్‌గా మారెడ్డి కృష్ణారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మనోజ్

నిజాంసాగర్, అక్టోబర్ 30 : మండలంలోని మాగి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు చీకోటి మనోజ్ కుమార్ పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు చేతులమీదుగా అందుకున్నారు. మనోజ్ మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీ చైర్మన్ నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించాలి



లింగంపేటలో మాట్లాడుతున్న శిక్షణ అధికారి



గాంధారిలోఎన్యుమరేటర్లకు శిక్షణ ఇస్తున్న టీవోటీలు



మాట్లాడుతున్న ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి

లింగంపేట/గాంధారి/ఎల్లారెడ్డి రూరల్/రామారెడ్డి/ నాగిరెడ్డిపేట /నస్రుల్లాబాద్/రాజంపేట్/బీబీపేట్/భిక్కనూర్/ నిజాంసాగర్, అక్టోబర్ 30: కుల గణన సర్వే సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు సేకరించాలని శిక్షణ అధికారి గంగాధర్ సర్వే సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేశ్, ఎంఈవో షౌకత్, ఏపీఎం చామంతి శ్రీనివాస్, సూపరింటెండెంట్ పవన్, నాయబ్ తహసీల్దార్ సంగమేశ్వర్, మండల పంచాయతీ అధికారి మలహరి, టీవోటీ చంద్రశేఖర్, ఏపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

నవంబర్ 1నుంచి ప్రారంభంకానున్న సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని గాంధారి మండల ప్రత్యేకాధికారిణి లక్ష్మీప్రసన్న అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో సమగ్ర ఇంటింటి సర్వేపై ఆయా శాఖల ఉద్యోగులు, ఎన్యుమరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో లక్ష్మీనారాయణ, పీఆర్‌ఏఈ వెంకట్‌రాములు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దామోదర్‌రెడ్డి ఉన్నారు.

ఎల్లారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వేపై మండల ప్రత్యేకాధికారి, ఆర్డీవో మన్నె ప్రభాకర్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సర్వే కోసం నియమితులైన ఎన్యుమరేటర్లకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఎంపీడీవో లక్ష్మి, తహసీల్దార్ మహేందర్, ఎంపీవో ప్రకాశ్, ఎంఈవో వెంకటేశం, శిక్షకుడు కృష్ణారెడ్డి తదితరులున్నారు.

సదాశివనగర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల స్థాయి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వే నిర్వహణ కోసం ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లకు ఒక్క రోజు శిక్షణ ఇచ్చామని మండల ఎంపీడీవో సంతోష్ తెలిపారు. కార్యక్రమంలో మండల పంచాయతీ ఆఫీసర్ సురేందర్‌రెడ్డి, విద్యాధికారి యోసెఫ్, శిక్షకుడు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట మండలంలో చేపట్టనున్న కుల గణన సర్వేను ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా చేపట్టాలని ఎన్యుమరేటర్లకు డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో కుల గణన సర్వేపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్, ఎమ్‌పీఎస్‌వో శ్వేత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని నస్రుల్లాబాద్ మండల ప్రత్యేకాధికారి దయానంద్ అన్నారు. మండల కేంద్రంలోని సమీకృత భవన సముదాయంలో ఆయన ఎన్యుమరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యకాంత్, ఎంఈవో చందర్, ట్రైనర్ బాలరాజ్, ఐసీడీఎస్ అధికారిణి వాణి తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలోని రైతు వేదికలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ సిబ్బందికి ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు సర్వే మార్గదర్శకాలను వివరించారు. మండల ప్రత్యేకాధికారి అపర్ణ, తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీవో రాజేశం, ఎంపీవో రఘురాం, ఎంఈవో పూర్ణచందర్‌రావు, టీవోటీలు ప్రకాశ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీబీపేటలోని రైతు వేదికలో ఇంటింటి సర్వే నిర్వహణపై మండల ప్రత్యేకాధికారి సతీశ్‌యాదవ్, ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ అవగాహన కల్పించారు. ఏ ఒక్క ఇంటిని వదలకుండా సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కులగణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని భిక్కనూర్ ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి అన్నారు. భిక్కనూరులోని ఐకేపీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఆశ, అంగన్‌వాడీ సిబ్బందికి కులగణన నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారిణి రజిత, అధికారులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ మండలంలోని సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, సమగ్ర కుటుంబ సర్వేకి సంబంధించి ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు

లింగంపేట(తాడ్వాయి), అక్టోబర్ 30 : తాడ్వాయి మండలంలోని చిట్యాల గ్రామానికి 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరైనట్లు సదాశివనగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జక్కుల రాజిరెడ్డి తెలిపారు. చిట్యాల గ్రామానికి విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు చేయాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును కోరగా వెంటనే స్పందించిన ఆయన గ్రామానికి 1.75 కోట్ల రూపాయలతో సబ్ స్టేషన్ మంజూరు చేయించినట్లు తెలిపారు. సబ్ స్టేషన్ మంజూరు చేయడంతో మండలంలోని సోమారం, సోమారం తండా, సంతాయిపేట, రాజంపేట మండలంలోని అన్నారం, అన్నారం తండా, వెంకాయిపల్లి గ్రామాల్లో లో ఓల్టేజీ సమస్య తీరుతుందని వెల్లడించారు. ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



సమావేశమైన చిట్యాల గ్రామస్తులు


# తడిసిన ధాన్యం పరిశీలన



రామారెడ్డిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న సొసైటీ చైర్మన్

రామారెడ్డి అక్టోబర్ 30 : మండలంలో మంగళవారం కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రం వద్ద తడిసి ముద్దయిన ధాన్యాన్ని అడ్లూర్ ఎల్లారెడ్డి సొసైటీ చైర్మన్ మర్రి సదాశివరెడ్డి సందర్శించి రైతులను ఓదార్చారు. ప్రభుత్వ ఆర్డర్ అలాట్‌మెంట్ రాగానే ధాన్యాన్ని తూకం వేసి రైస్ మిల్లులకు పంపడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వంతో చర్చించి తరలించడానికి సిద్ధంగా ఉన్నామని చైర్మన్ తెలిపాడు. ఆయనవెంట సొసైటీ వైస్‌చైర్మన్ పశుపతి, తదితరులు ఉన్నారు.

## గాంధారి మండల ప్రత్యేకాధికారిణిగా లక్ష్మీప్రసన్న



ప్రత్యేకాధికారిణిగా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీప్రసన్న

గాంధారి, అక్టోబర్ 30 : జిల్లా వ్యవసాయ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వ్యవసాయ సంచాలకురాలు (ఏడీఏ) లక్ష్మీప్రసన్న బుధవారం మండల ప్రత్యేకాధికారిణిగా బాధ్యతలు స్వీకరించారు. ఆమెను ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది శాలువా కప్పి సన్మానించారు.

## పాఠశాలకు బీరువా వితరణ

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 30 : మండలంలోని మల్లయ్యపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలకు ఈసీఎస్ ఫౌండేషన్ ఎండీ చంద్రశేఖరన్ బుధవారం బీరువాను డొనేట్ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథం ఈసీఎస్ ఫౌండేషన్ ఎండీ చంద్రశేఖరన్‌కు పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.



పాఠశాలకు ఈసీఎస్ ఫౌండేషన్ ఎండీ చంద్రశేఖరన్ ఇచ్చిన బీరువా

## ఎల్లారెడ్డిలో వెలసిన పటాకుల దుకాణాలు



ఎల్లారెడ్డి గోపాలకృష్ణుడి ఆలయ ఆవరణలో వెలసిన పటాకుల దుకాణాలు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 30 : దీపావళి పండుగను పురస్కరించుకొని ఎల్లారెడ్డి పట్టణంలోని గోపాలకృష్ణుని ఆలయ ఆవరణలో బుధవారం పటాకుల దుకాణాలు వెలిశాయి. అనుమతులు పొందిన దుకాణాదారులు ఫైర్, రెవెన్యూ, పోలీసుశాఖల అనుమతులతో పట్టణంలో 12 దుకాణాలను ఏర్పాటు చేశారు.

## 'నవోదయ'లో ప్రవేశానికి గడువు పొడిగింపు

నిజాంసాగర్, అక్టోబర్ 30 : నిజాంసాగర్‌లో ఉన్న నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి 9, 11వ తరగతుల్లో ప్రవేశానికి పరీక్ష గడువును వచ్చే నెల 9వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు నవోదయ విద్యాలయ సమితి బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ అవకాశాన్ని కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల విద్యార్థులు వినియోగించుకోవాలని కోరింది.